
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
సోమవారం 9 జూన్ 2025



నందీశ్వరా.. ఏమిటీ దోపిడీ..!



- టికెట్స్.. పూజల రూపంలో అక్రమాలు
- రుద్రాక్ష పేరుతోనూ దోచేస్తున్న వైనం
- మాయమైన రెండు కిలోల వెండి
- ఇద్దరు ఉద్యోగులు, ఓ మండల నాయకుడి దందా
- నెలకు రూ.లక్షల్లో వసూళ్లు
- దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు

నంద్యాల, జూన్8(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో భక్తులు నిత్యం దోపిడీకి గురి అవుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. టికెట్స్, పూజలు, భక్తులిచ్చే బహూకరణలు వరకు ఇలా. ఎక్కడ పడితే అక్కడ అందిన కాటికి దోచేడమే లక్ష్యంగా అక్కడ కొందరు ఉద్యోగులు ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అధికారులతో పాటు ఓ మండల నాయకుడు కలిసి తమదైన శైలిలో నెలవారి అక్రమ వసూళ్లకు తెరలేపి నెలకు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. వీరితో పాటు అక్కడ పనిచేసే బావ బామ్మర్థులు సైతం రుద్రాక్షల పేరుతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. పైగా అక్కడ జరిగే వ్యవహారంపై ఎవరైనా ప్రశ్నించినా.. ఆరా తీసినా వెంటనే సంబంధిత ప్రజాప్రతినిధి పేరు అడ్డుగా వాడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మొత్తంగా మహానందీ క్షేత్రంలో జరిగే పలు వ్యవహారాలపై భక్తులతో పాటు ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే క్రమంలో దేవుడికే శఠగోపం పెట్టారనే ప్రచారం జోరందుకుంది. ఫారెన్‌కు చెందిన రెండు కేజీల వెండి మాయం కావడమే ఇందుకు నిదర్శనం.

తమదైన శైలిలో చేతివాటం..

మహానందిలో భక్తులు తాకిడి ఎక్కువ. ఇదే అదనుగా భావించిన కొందరు ఉద్యోగులు సైతం తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగుల్లో కీలక అధికారి కిందిస్థాయిలో పనిచేస్తున్న ఓ అధికారితో పాటు.. అర్చకుల్లో బావ బామ్మర్థులు కలిసి పలు రూపాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఒకే టికెట్‌పై ఎక్కువ మంది భక్తులు పంపి దర్శనాలు చేయిస్తున్నారని సమాచారం. ఇదీ చాలదన్నట్లుగా.. రుద్రాక్ష పూజల పేరుతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారని సమాచారం. భక్తుల ఏదైనా సమస్యతో వస్తే.. ఆయా భక్తుల సమస్యల బట్టి రూ.500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తారని తెలిసింది. ఈరూపంలోనే రోజుకు సుమారు రూ.10వేలకు పైగానే వస్తుందని సమాచారం. ఈలెక్కన నెలకు లక్షల్లోనే వారి జేబుల్లోకి వెళ్తున్న ట్లైంది. కార్తీక మాసంలో అడ్డదారిలో దర్శనాలు చేయించి ఉద్యోగులు రూ. లక్షల్లో సొమ్ముచేసు కున్నారనే విమర్శలు లేకపోలేదు. అర్చకులను ప్రతి మూడు నెలలకు ఒకసారి విభాగాలను మార్చాల్సి ఉన్నా ఆదాయం వచ్చే విభాగాల్లో కొందర్ని అక్కడే నెలల తరబడి కొనసాగిస్తున్నారని సమాచారం. అలాగే ఓ ఇన్‌స్పెక్టర్ (ఆలయంలో పనిచేసే అధికారి బంధువు) పెద్దఎత్తున అవినీతి పాల్పడుతున్నట్లు సమాచారం. మహానంది క్షేత్రంలోని వివిధ ఆలయాలను అక్రమంగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సిబ్బంది పట్ల కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం.

ఏజెన్సీ నిర్వాహకుడికి చుక్కలు

మహానంది ఆలయంలో ఓఏజెన్సీ కింద 50మంది పనిచేస్తుంటారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి సదరు ఉద్యోగులను పలురకాలుగా బెది రించి క్యాష్ చేసుకోవడం ఇక్కడి నైజం. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే అక్కడ పనిచేస్తున్న ఇద్దరు కీలక అధికారులు.. మండల నా యకుడితో కలిసి తమదైన శైలిలో సదరు ఏజెన్సీ నిర్వాహకుడికి చుక్కలు చూపించారు. ప్రజాప్రతినిధి పేరు చెప్పి మరీ భయపెట్టారని తెలిసింది. 20మంది ఉద్యోగులను ఉద్యోగం నుంచి తీసేస్తున్నామని చెప్పండి.. అని సదరు ఏజెన్సీ నిర్వాహకుడికి ఈముగ్గురు ఆదేశిస్తే.. సదరు నిర్వాహకుడు వారందర్ని తీసేస్తున్నామని చెప్పాడు. లేదంటే ఈ ముగ్గర్ని కలవాలని సలహా ఇచ్చారని తెలిసింది. దీంతో ఆ ఉద్యోగులు ఈ ముగ్గురిని కలిస్తే.. సదరు మండల నాయకుడి ద్వారా ఒక్కొక్కరి నుంచి రూ.30 నుంచి 50వేల వరకు తీసుకుని యథావిధిగా విధుల్లో కొనసాగించారని బాధిత వర్గాల నుంచి తెలిసింది. ఈ లెక్కన వారికి లక్షల్లో వారి జేబుల్లోకి వెళ్లినట్లైంది.



ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్ర యించే దుకాణం

మహానంది క్షేత్రంలో ఓ మండల నాయకుడు, ఇద్దరు అధికారులు వివిధ రూపాల్లో నెలకు రూ.లక్షలు ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. ఎవరైనా సదరు విషయాలపై ప్రశ్నించినా.. ఆరాతీసినా.. ఈ ముగ్గురు ఆ ప్రాంత ప్రజాప్రతినిధి పేరు చెప్పి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు లేక పోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే..

మండల నాయకుడు చెప్పింది జరగాల్సిందే..

ఆలయంలో సదరు మండల నాయకుడు ఏమీ చెప్పితే.. అదీ జరిగి తీరాల్సిందే.. లేకుంటే ఎంతటి వారైనా హడలెత్తాల్సిందే అనే ప్రచారం లేకపోలేదు. ఏది ఏమైనా నేడు ఆశాఖ మంత్రి సైతం స్పందించి ఇక్కడ జరిగే అక్రమాలపై ప్రత్యేక దృష్టిసారించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నెలవారీ మామూళ్లకు పాల్పడుతుంటే..

నిబంధనల ప్రకారం ప్రతి దుకాణం వద్ద ధరల పట్టికను ప్రదర్శించాలి. సదరు నిబంధనలు అమలుచేయాల్సిన బాధ్యత ఆలయ అధికారులదీ. కానీ.. కట్టడి చేయా ల్సిన అధికారులే నెలవారీ మామూళ్లకు పాల్పడుతుంటే ఏమాత్రం నియం త్రణ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆయా దుకాణాల నుంచి నెలకు రూ. లక్షకు పైగానే వసూళ్లు చేస్తున్నారని సమాచారం. ఇదే అదునుగా భావించి సదరు దుకాణాల యజమానులు సైతం వచ్చే భక్తులను అధిక ధరలతో బురిడి కొట్టిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ప్రైవేట్ లాడ్జీల నిర్వాహకులతో ఆలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు ఒప్పందం కుదుర్చుకుని నెలకు ఇంత అని..? టికెట్ లేకుండా అడ్డదారిలో పూజలు చేయించడం క్యాష్ చేసుకోవడం రోజువారీ దినచర్యగా ప్రచారం సాగుతోంది.

అడ్డదారిలో రికార్డుల్లో నమోదు

అక్కడ పనిచేస్తున్న కొందరు అర్చకులకు ఎలాంటి అర్హతలు లేకపోయినా.. పూర్వీకుల నుంచి తమ సంప్రదాయం కొనసాగిస్తున్నామని(వారసత్వపు హక్కు వచ్చే విధంగా) తగిన ఇద్దరి పేర్లను రికార్డుల్లో నమోదు చేశారని సమాచారం. ఈ వ్యవహారంలో ఆశాఖ ఉన్నతాధికారుల నుంచి ఇక్కడ పనిచేస్తున్న ఉన్నతాధికారులకు రూ.లక్షల్లో చేతులు మారాయనే ఆరోపణలు లేకపోలేదు. ఇక్కడి నుంచి బదిలీ అయిన ఓ ఉద్యోగికి రావాల్సిన పెండింగ్ ఏరియర్స్ తదితర వాటిని మంజూరు చేయడానికి కొందరు అధికారులు రూ. లక్షల్లో తీసుకున్నారని సమాచారం.

రసీదులు ఇవ్వకుండా..

భక్తులు స్వామికి ఏదో రకమైన కాను కలు ఇస్తుంటారు. కానుకలు ఇచ్చిన వెంటనే తగిన రసీదు కూడా ఇవ్వాలి. ఫారెన్‌కు చెందిన ఇద్దరు(దంపతులు) 2020 సెప్టెం బరు నెలలో స్థానికులు ఇద్దరి సహకారంతో వచ్చి స్వామివారిని దర్శించు కున్నా రు. ఆతర్వాత స్వామివారికి రెండు కేజీల వెండి(నాలుగు బిస్కెట్‌లు) కానుకగా అందజేశారు. ఇదే సమయంలో అప్పటి ఆలయం ఉన్నతాధికారి లేరని సాకుగా చెప్పివారికి తగిన రసీదు ఇవ్వలేదని తెలిసింది. ఇప్పటికి తగిన రసీదు ఫారెన్ వాళ్లకు కానీ వారిని పిలుచుకుని వచ్చిన స్థానికులకు(ఇద్దరు వ్యక్తులకు) కానీ ఇవ్వ లేదు. ఆ వెండిని మాయం చేశారనే ప్రచారం అప్పట్లో సాగింది. ఇటీవల అక్కడ పనిచేస్తున్న ఉద్యో గుల్లో లావాదేవీల విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో ఆ రెండు కేజీల వెండి విషయం మరోమారు బయటపడినట్లైంది. ఇంటి దొంగను ఈశ్వరుడైనా కనిపెట్టలేడ న్నట్లుగా మహానందిలో పరిస్థితి ఏర్పడింది.

ఏపీ మెగా డీఎస్సీకి 113 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఏపీ మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా రెండో రోజు ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 113 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజి), హిందీ ఎస్‌ఏ(లాంగ్వేజి), హిందీ ఎస్‌ఏ(లాంగ్వేజి) కన్నడ అభ్యర్థులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల మొదటి సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 391 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 384 మంది అభ్యర్థులు హాజరై ఏడుగురు గైర్హాజరయ్యారు. పీజీటీ (నాన్‌లాంగ్వేజీ), గణితం(ఇంగ్లీష్ మీడియం), టీజీటీ (లాంగ్వేజి), సంస్కృతం-టీజీటీ(నాన్ లాంగ్వేజి), బయోలాజికల్ సైన్స్(ఇంగ్లీష్ మీడియం) అభ్యర్థులకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 872 మంది అభ్యర్థులకు గాను 766 మంది అభ్యర్థులు హాజరుకాగా 106 మంది గైర్హాజరయ్యారు. అందులో ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సెషన్‌లో పరీక్ష లేదు. రెండో సెషన్‌లో 282 మంది అభ్యర్థులకు గాను 261 మంది హాజరు కాగా 21మంది గైర్హాజర య్యారు. ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సెషన్‌లో 181 మంది అభ్యర్థులకు గాను 179మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజర య్యారు. రెండో సెషన్‌లో 180 మంది అభ్యర్థులకు గాను 171 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు. శాంతిరామ్ ఇంజనీ రింగ్ కళాశాలలో మొదటి సెషన్‌లో పరీక్ష నిర్వహించలేదు. రెండో సెషన్‌లో 200 మంది అభ్యర్థులకు గాను 174 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. శ్రీ రామకృష్ణా పీజీ కళాశాలలో మొదటి సెషన్‌లో 90 మంది అభ్యర్థులకు గాను 87 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో 90 మంది అభ్యర్థులకు గాను 70 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. శ్రీ రామకృష్ణా అటానమస్ డిగ్రీ కళాశాలలో మొ దటి సెషన్‌లో 120 మంది అభ్యర్థులకు గాను 118 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో 120 మంది అభ్యర్థులకు గాను 90 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు.

ఘనంగా స్వాతి సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ జూన్ 8(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఆవ రణలో సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం రక్షా కంకణాలను భక్తులకు వితరణ చేశారు. ఎగువ దిగువ అహోబిలం క్షేత్రాలలో స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే నవ నరసింహ సన్నిధికి భక్తులు నడిచి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. స్వాతి సందర్భంగా వచ్చిన భక్తులకు దేవస్థానం, సత్రాల నిర్వాహ కులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిం చనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ఉదయం 9:30గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. అర్జీదారులు తమ దర ఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసు కోవడానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1100కాల్ సెంటర్‌ను సంప్రదించి తెలుసు కోవచ్చని వివరించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నేడు పోలీసు కార్యాలయంలో రద్దు

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు చేస్తున్న ట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి రావొద్దని పేర్కొ న్నారు. వారి పరిధిలోని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు దారులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

- సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం
- 14న తల్లికి వందనం డబ్బులు జమ
- 24 నెలల్లోనే హైవే నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలోని కుందూ నది పక్కనే ఉన్న ఎన్‌హెచ్ 167కేలో నంద్యాల నుంచి కర్నూలు, కడప జిల్లాల సరిహద్దు సెక్షన్ వర్క్ షేప్‌షోల్డరుతో కూడిన రెండు వరసల రహదారి నిర్మాణానికి మంత్రి బీసీ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతుంటే వైసీపీ నాయకులు విమర్శించడం తగదన్నారు. గత వైసీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి ఈనెల 14వ తేదీ లోపు డబ్బులు జమ చేస్తారన్నారు. జూన్‌నెలలోనే రైతు భరోసా పథకం అమలు చేస్తారని, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసి తీరుతుందన్నారు. ఎన్‌హెచ్ 167కే హైవే పనులు 24 నెలల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా వాసులు బెంగుళూరు వెళ్లడానికి ఈ నేషనల్ హైవే రహదారి ఎంతో వీలుగా ఉంటుందన్నారు. ఈ రహదారితో కడప, నంద్యాల జిల్లావాసుల జీవనాధారం మెరుగుపడుతుందని, రెండు జిల్లాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, బనగానపల్లె మార్కెట్‌యార్డు ఛైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టీడీపీ నాయకులు గువ్వల సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి, శ్రీనిధి హోటల్ మద్దిలేటి, కలుగొట్ల అర్జున్‌రెడ్డి, వెలగటూరు ధనుంజయుడు, బిజినవేముల హుసేనయ్య, గోవిందిన్నె బాలరాజు, చిన్నకొప్పర్ల బుచ్చన్న, లింగాలనాయుడు, గోవర్ధనరెడ్డి, సునీల్‌రెడ్డి చెప్పలి సుదర్శన్‌రెడ్డి, పెనుగొండ రాజశేఖర్, కుళాయి బాషా పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం

మంత్రాలయం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం లక్షల్లో భక్తులు తరలివచ్చారు. వరుస సెలవు దినాలు కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరాగా రద్దీ నెలకొంది. భక్తులతో అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం సందడిగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి పూజలు చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య
నేడు మహానందికి దేవదాయశాఖ మంత్రి రాక 7

ఏపీఈఏపీ సెట్ ఫలితాలు విడుదల

- జిల్లాలో అర్హత సాధించిన 3,648 మంది విద్యార్థులు
- నంద్యాల జిల్లా విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ రంగాల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. 3075 మంది బాలురు ప్రవేశ పరీక్ష రాయగా 2117 మంది, 2130 మంది బాలికలు ప్రవేశ పరీక్ష రాయగా 1531 మంది అర్హత సాధించారు. మొత్తంగా 3648 మంది అర్హత సాధించారు.

నంద్యాల జిల్లా విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో నాల్గవ ర్యాంక్



రామ్‌చరణ్ రెడ్డి

నంద్యాల జిల్లా అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన రామ్‌చరణ్‌రెడ్డి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ సాధించాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, నంద్యాల 35వ వార్డు సచివాలయం ఉద్యోగి రాణిరుద్రమదేవి కుమారుడైన రామ్‌చరణ్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ సాధించడం పట్ల పలువురు ప్రశంసించారు. రామ్‌చరణ్‌రెడ్డి 5వ తరగతి వరకు నంద్యాలలోని కేశవరెడ్డి స్కూల్‌లో, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విజయవాడలోని శ్రీ చైతన్య పాఠశాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో చదివారు. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడు రామ్‌చరణ్‌రెడ్డి ఇటీవల విడుదలైన తెలంగాణా టీజీఈఏపీసెట్‌లో కూడా రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించారని, అలాగే జేఈఈ మెయిన్స్‌లో 53వ ర్యాంక్, అడ్వాన్స్‌డ్‌లో 170వ ర్యాంక్ సాధించారని తెలిపారు. విద్యార్థి రామచరణ్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఐఐటీలో సీఎస్ఈ చేయాలని ఉందని, జేఈఈలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా మద్రాస్‌లో కాని, కాన్పూర్‌లో కాని సీటు వస్తుందని, ఐఐటీ పూర్తిచేయడమే తన లక్ష్యమని అన్నారు.



రామ్‌చరణ్ రెడ్డితో కుటుంబసభ్యులు

ఉపాధి కూలీలకు భరోసా..

- ప్రమాద బీమా రూ.50వేల నుంచి రూ.4 లక్షలకు పెంపు



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేసే శ్రామికులకు గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. ప్రమాదవశాత్తు వారు మరణిస్తే కేవలం ప్రమాద బీమా రూ.50 వేలు మాత్రమే చెల్లించేవారు. దీంతో ఆ కుటుంబాలు వీధి పాలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న రైతులు, కూలీలకు ప్రమాద బీమా మొత్తాన్ని రూ.50వేల నుంచి రూ.4 లక్షలకు పెంచడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కర్నూలు జిల్లాలో మూడున్నర లక్షల కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 2 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి.

ప్రమాద బీమా రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు పెంపు

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న ఉపాధి శ్రామికులకు మేలు చేకూర్చే కార్యక్రమాన్ని ఇటీవల వెల్లడించారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మంది ప్రస్తుతం పనులు చేస్తున్నారు. వీరికి రోజూ వారి వేతనం రూ.307కు పెంచారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల అమరావతిలో నిర్వహించిన ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయికలో భాగంగా బీమా పరిహారంపై ప్రకటన చేశారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించినా, తీవ్ర అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబ సభ్యులకు బీమా వర్తిస్తుంది. ఇది ఇప్పటి వరకు గరిష్ఠంగా రూ.50వేలు మాత్రమే ఉండగా.. ప్రస్తుతం రూ.4లక్షలకు పెంచారు.

శ్రామికులకు ఎంతో మేలు

కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న శ్రామికులకు, తాత్కాలిక ఉద్యోగులకు ప్రమాద బీమా మొత్తాన్ని పెంచింది. ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడినా గతంలో కంటే ప్రస్తుతం ఎక్కువ మొత్తాన్ని పరిహారంగా అందిస్తారు. గతంలో రూ.50వేలు మాత్రమే చెల్లించేవారు. ప్రస్తుతం రూ.4లక్షల దాకా బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పేద కుటుంబాల్లో ఈ పథకంపై మరింత శ్రద్ధ పెరిగి ఎక్కువ మంది శ్రామికులు పని కోసం వచ్చే అవకాశం ఉంది.

● వెంకటరమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు

లక్షన్నర మందికి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం లక్షన్నర మంది దాకా ఉపాధి పనులు చేస్తున్నారు. వీరంతా సొంత గ్రామాలతో పాటు సమీప గ్రామాలకు పనులకు వెళ్తున్నారు. ఈ క్ర మంలో పని ప్రదేశంలో పాము కాటు, వడదెబ్బ, పిడుగు తదితర కారణాల వల్ల మృతి చెందుతున్నారు. ఇలాంటి వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించనుంది.



బి. తాండ్రపాడు చెరువులో ఆకట్టుకుంటున్న గుర్రపు డెక్క పూలు

గుర్రపు డెక్క... పూసెను ఎంచక్కా..!

కర్నూలు నగర శివారు ఉన్న బి.తాండ్రపాడు చెరువులో గుర్రపు డెక్క పూలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కర్నూలు-నంద్యాల ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెరువు కడతూము భాగం గుర్రపు డెక్కతో అల్లుకుపోయి.. పూలతో నిండిపోయింది. దూరం నుంచి చూస్తే వంగపూలతో తివాచి పరిచినట్లు అందంగా కనిపిస్తోంది. పచ్చని ఆకుల మధ్య తెలుపు, వంగపూత రంగులతో పూశాయి. గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి ఆటంకమే అయినా, ఇలా పూలు విరగబూసి ఆకర్షిస్తున్నాయి. ఆ రహదారి వెంట వెళ్తున్న వారు అక్కడ ఆగి సెల్ఫీలు, ఫొటోలు తీసుకొని ఆనందిస్తున్నారు.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆదివారం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జ్యోతి మూలెమణి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద శ్రీమఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి శ్రీపతిఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనస్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈమె వెంట ఎస్ఐ శివాంజిల్, వ్యాసరాజ ఆచార్, జేపీ స్వామి, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహానందికి దేవదాయశాఖ మంత్రి రాక

నూతన వసతి గృహాల నిర్మాణానికి భూమి పూజ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రానికి సోమవారం ఉదయం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. మంత్రి చేతుల మీదుగా క్షేత్ర పరిధిలో దేవదాయశాఖ నిధులతో రూ.10 కోట్లతో నిర్మించే 55 గదుల వసతి గృహాలకు భూమి పూజ చేయించి నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. మహానంది పరిసరాల్లో భక్తుల వసతి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో రూ.1.60 లక్షలతో నిర్మించిన డార్మెంటరీని కూడా మంత్రి చేత ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివాలయం పునఃనిర్మాణ పనుల కోసం రూ.కోటితో చేపట్టనున్న అభివృద్ధి పనులను కూడా మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని జొన్నగిరిలో జరిగినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రాంపల్లి సతీష్(25) హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తల్లి గోవిందమ్మకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇటీవలే జొన్నగిరికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. తల్లి ఆరోగ్యం కోసం రూ.5లక్షలు అప్పులు చేశారు. వాటిని ఎలా తీర్చాలో అర్థంకాక మనోవేదనకు గురయ్యాడు. ఇంటిపైన రేకుల షెడ్డులో ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. సతీష్‌కు భార్య భూమిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి పనులకెళ్లి.. మృత్యు ఒడికి

● తిరుపతిలో కూలి పని చేస్తూ యువకుడి దుర్మరణం

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లి మట్టి పనులు చేస్తూ ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన తిరుపతిలో శనివారం చోటుచేసుకున్నట్లు బంధువులు తెలిపారు. వివరాలు.. మంత్రాలయం మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన చాకలి నాగరాజు(26) ఆరునెలల క్రితం కుటుంబంతో కలిసి కూలీ పనుల కోసం తిరుపతికి వలస వెళ్లాడు. శనివారం అక్కడ మట్టి పనులు చేస్తుండగా పైనున్న మట్టి నాగరాజుపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి సొంత గ్రామమైన మాలపల్లికి తీసుకువచ్చారు. పొట్టకూటి కోసం వలస వెళ్లి మృతిచెందడంతో భార్యాపిల్లలు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. నాగరాజుకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వలస వెళ్లి మృతిచెందిన నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక డిమాండ్



జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ముట్టడి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఎస్‌జీటీలకు ప్రాధాన్యత క్రమంలో 3,500 ఖాళీలు ఆప్షన్లుగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లాపై పూర్తిగా అవగాహన ఉన్న వారు మాత్రమే ఆప్షన్ ఇచ్చుకోగలరన్నారు. లేకపోతే ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. మహిళా సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ఆప్షన్ ఒక్కరోజులో ఇవ్వడం అసాధ్యమని, పొరపాట్లు జరిగితే రెండు సంవత్సరాలపాటు దాని ఫలితం అనుభవించాల్సి వస్తుందన్నారు. ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్లు సేవాలాల్ నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

● ఐదుగురికి గాయాలు

● మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు, ఎమ్మిగనూరు కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కరణం గురు రాజారావు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. ఆదివారం గ్రామానికి చెందిన చాకలి నాగరాజు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో ఇరువర్గాలు ఎదురెదురు పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఐదుమందికి గాయాలయ్యాయి. వైసీపీకి చెందిన గురురాజారావు తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, రాజు, రంగస్వామికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ గ్రామానికి చేరుకుని శాంతిభద్రతలను అదుపు చేశారు. ఇరువర్గాలు అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. పొలం తగాదాలే ఈ ఘర్షణకు కారణమని తెలుస్తోంది. వైసీపీ నాయకులను ఎమ్మిగనూరు ఆసుపత్రికి, టీడీపీ నాయకులను ఆదోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను విచారించి కేసు నమోదు చేస్తామని మంత్రాలయం సీఐ, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మాలపల్లిలో టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ జరగడంతో అటూ టీడీపీ, ఇటు వైసీపీ నాయకులు అప్రమత్తమయ్యారు.

మహానందిలో భక్తుల రద్దీ

రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు



దర్శనం కోసం క్యూలో భక్తులు



రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం ఆదివారం వేలాది మంది భక్తుల రద్దీతో పోటెత్తింది. వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులతో పాటు చిన్నారులకు వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని కుటుంబ సమేతంగా మహానందీశ్వరుని దర్శనం కోసం తరలి వచ్చారు. దేవస్థానానికి చెందిన అరకొర వసతి గృహాలు శనివారం సాయంత్రమే నిండిపోవడంతో సమీపంలోని ప్రైవేట్ వసతి గృహాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వేకువజాముననే ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి దర్శనం కోసం ఓపికతో క్యూలో నిలబడ్డారు. క్షేత్ర పరిసరాల్లో ఆదివారం రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది.

వైసీపీ నాయకుడి బెదిరింపు

కొలిమిగుండ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించమంటే అంతు చూస్తానని .. వైసీపీ నేత, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోద రుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి బెదిరించినట్లు చర్చ జరుగు తోంది. వైసీపీ నేత, కొలిమిగుండ్ల మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన చెక్కా వెంకటరాముడు రామ్‌కో సిమెం ట్ పరిశ్రమలో ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి కాంట్రాక్టు పనులకు టిప్పర్లు బాడుగకు పెట్టాడు. 25-05-2023 నుంచి సుమారు 6 నెలల పా టు టిప్పర్ల బాడుగగా ఆయన రూ.17.46 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ము ఇవ్వాలని పలుమార్లు కోరినా ఉదయభాస్కరరెడ్డి సరైన సమా ధానం ఇవ్వకపోగా, చెక్కా వెంకటరాముడిని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

ఆస్తి కోసం దారుణ హత్య

చాగలమర్రి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శెట్టివీడు గ్రామంలో ఆదివారం రాత్రి కట్టుబడి మదార్‌సా (75) దారుణ హత్యకు గురయ్యారు. మదార్‌సా గ్రామంలోని మసీదులో మౌజన్‌గా పని చేస్తుండేవారు. తన కున్న ఎకరా పొలంలో వ్యవసాయం చేసుకుం టూ భార్య మహబూబ్బీతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మసీదు లోనే ఐదు పూటలా నమాజు చేసుకుంటూ, మౌజన్‌గా పని చేస్తున్నారు. మదార్‌సాతో ఆయన తమ్ముడి మనవడు హుస్సేన్‌సా ఆస్తి కోసం ఘర్షణ పడ్డాడు మదార్‌సాను మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి హత్య చేసి తాళం వేశాడు. మసీదు లోపలికి వెళ్లిన ఓ వ్యక్తి మరుగుదొడ్డి వద్దకు వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా మదర్‌సా హత్యకు గురై ఉండటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారించారు. హత్యకు గురైన మదార్‌సా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ సురేష్ మృతదేహాన్ని పరిశీలించి జరిగిన ఘటనపై కుటుంబ సభ్యులతో విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైల దేవస్థానానికి వాహనాల అందజేత



దేవస్థానం అధికారులకు వాహనాల పత్రాలను అందజేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

నంద్యాల కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానానికి కెనరాబ్యాంకు తరఫున రెండు బొలెరో వాహనాలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు కెనరా బ్యాంకు కర్నూలు ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్ వాహనాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ రెండు వాహనాల విలువ సుమారు రూ.21.56లక్షలకు పైగా ఉంటుందని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగేశ్వరరావు, కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ వెంకటేష్, స్థానిక బ్యాంకు మేనేజర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ఆర్డీవో సందీప్‌కుమార్







యోగాసనాలు వేస్తున్న ప్రజలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్డీవో ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కూడా ఇదే స్ఫూర్తితో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ సుధాకర్‌రెడ్డి, సైనిక్ వెల్ఫేర్ అధికారి, కర్నూలు తహసీల్దార్ రమేష్, దిన్నెదేవరపాడు సర్పంచ్ మాధవస్వామి, తాండ్రపాడు సర్పంచ్ జయన్న, టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, యోగా అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగా శిక్షకులు, ప్రజలు పాల్గొన్నారు.

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

● 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని 'కుడా' చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే భారతీరెడ్డి, కొమ్మినేని, కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ న్యూస్ పేపర్, ఓ న్యూస్ చానల్‌లో తప్పుడు .. రోత రాతలు రాయడం దుర్మార్గమని అన్నారు. అమరావతి నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములను త్యాగం చేసిన రైతుల పట్ల ఇలాంటి వారిని ఏం చేయాలో ప్రజలే చెప్పాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నాగన్న (ఫైల్)

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కర్నూలు జిల్లాలో జరిగింది. తుగ్గలి మండలంలోని గుడిసె గుప్పరాలకు చెందిన నాగన్న (58) తనకున్న 4.67 ఎకరాల పొలంతో పాటు దాదాపు 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది, ఆముదం, పత్తి సాగుచేసేవారు. గత కొన్నేళ్ల నుంచి కొన్న పంటలు సరైన దిగుబడులు లేక, దిగుబడి ఉన్నా కొన్ని పంటలకు ధరలు లేక అప్పులపాలయ్యారు. వర్షాలు సరిగా కురవడం లేదని నాలుగు బోర్లు కూడా వేశారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని నాలుగేళ్ల క్రితం తనకున్న 4.67 ఎకరాల్లో రెండెకరాల భూమిని అమ్మేసి కొంత వరకు అప్పులు తీర్చారు. ఇప్పటికీ సుమారు రూ.10లక్షల అప్పు ఉంది. దీంతో ఆ అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపం చెందేవారు. ఈ క్రమంలో ఈనెల 7న నాగన్న తన పొలం సమీపంలో పురుగు మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న రైతును అటువైపు వెళ్తున్న వారు చూసి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు రైతును చికిత్స నిమిత్తం గుత్తికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అయితే నాగన్న చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. నాగన్నకు భార్య జయమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు సోమశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మోహన్, సోమశేఖర్‌గౌడు, సుధాకర్ గౌడు నాగన్న మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

దేవనకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి కప్పట్రాళ్లకు చెందిన షేక్షావలి అనే వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. జిల్లేలబుడకలకు చెందిన మహిళ ఫిర్యాదుతో పోలీసులు షేక్షావలి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. ఇరువర్గాల విచారణ అనంతరం స్టేషన్ ఎదుటనే షేక్షావలి పురుగుమందు తాగాడు. పోలీసుల వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. నెల నుంచి తిరుగుతున్న పోలీసులు న్యాయం చేయడం లేదని షేక్షావలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

సిఫారసు లేఖ చిచ్చు

కర్నూలు హాస్పిటల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్యఆరోగ్య శాఖలో జరుగుతున్న బదిలీల్లో ఓ గుర్తింపు పొందిన యూనియన్ సిఫారసు లేఖ చిచ్చుపెట్టింది. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ఉద్యోగి 26ఏళ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో పనిచేస్తున్నారు. ఈ ఉద్యోగికి గుర్తింపు పొందిన ఓ యూనియన్ రాష్ట్ర కమిటీ సిఫారసు లేఖను నేరుగా కడప ఆర్‌డీ కార్యాలయానికి పంపింది. జోనల్ క్యాడర్ ఉద్యోగికి రాష్ట్ర అధ్యక్షుడి సంతకంతో లెటరు ప్యాడ్ ఇవ్వడంపై జిల్లా యూనియన్, రాష్ట్ర యూనియన్‌కు మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ఉద్యోగికి సిటీ జాయింట్ సెక్రటరీకి సిఫారసు లేఖను ఇస్తూ జిల్లా యూనియన్‌కు పంపించారు. ఈలేఖను జిల్లా యూనియన్ తిరస్కరించింది. అయితే ఉన్నట్టుండి రాష్ట్ర అధ్యక్షుడి సంతకంతో బదిలీల నుంచి మినహాయించే లేఖ ఇవ్వడం జిల్లా, రాష్ట్ర శాఖల మధ్య చిచ్చు రగులుతోంది. కాగా ఈ సిఫారసు లేఖ కోసం డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. కర్నూలు సిటీ కమిటీ ఇచ్చిన సిఫారసు లేఖ చెల్లదని జిల్లా అధ్యక్షుడు దాన్ని తిరస్కరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాఖ నేరుగా జిల్లా శాఖకు తెలియకుండా సిఫారసు లేఖను కడప ఆర్‌డీకి పంపించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జిల్లా శాఖ నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. జిల్లా శాఖకు తెలియకుండా సిఫారసు లేఖ రాష్ట్ర శాఖ నేరుగా ఎలా ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మల్లేశ్వరా.. మన్నించవయ్యా!

- శిథిలావస్థకు చేరిన మల్లేశ్వరస్వామి ఆలయం
- వర్షాకాలంలో ఆలయం చుట్టూ, లోపలికి వర్షపునీరు
- మాన్యాలు ఉన్నా అభివృద్ధి శూన్యం
- చెరువు నిర్మాణంలో మునకకు గురైన ఆలయ భూములు
- నేటికీ అందని నష్ట పరిహారం
- పట్టించుకోని దేవాదాయ శాఖాధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు



వర్షం నీటితో నిండి వున్న తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం (ఫైల్)

కొత్తపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కొన్నివందల ఏళ్ల చరిత్ర గల కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో పూర్తిగా కారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రాచీన ఆలయం నేడు కళావిహీనంగా కనిపిస్తుండటంతో భక్తజనం ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మల్లేశ్వరస్వామి ఆలయానికి సుమారు 60ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ప్రతి ఏటా సుమారు రూ.4 లక్షలకు పైగా ఈ భూములకు కౌలు కూడా వస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు దేవాదాయ శాఖ నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు.

చరిత్ర ఘనం..

ఘన చరిత్ర గల ఆలయం ప్రాంగణంలో వర్షం నీరు వచ్చి చేరుతుంది. ఆలయం మొత్తం వర్షం కారుతుండటంతో మల్లేశ్వరస్వామి కూడా వర్షం నీటిలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పూజలు కూడా ఆ సమయంలో నిర్వహించలేని పరిస్థితి ఉంది. చోళాభూపాల మహారాజు కాలంలో 11వ శతాబ్దకాలంలో జనమే జయరాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తుల ద్వారా తెలుస్తుంది. ఈ ఆలయానికి చెందిన 638 సర్వేనెంబరులో 1.76 ఎకరాలు, 639 సర్వేనెంబరులో 5.64 ఎకరాల మాన్యం భూమి సుమారు 15ఏళ్ల క్రితం జి.పుల్లారెడ్డి చెరువు నిర్మాణంలో మునకకు గురైంది.

ప్రభుత్వం నుంచి నష్టపరిహారం



తాండవ మల్లేశ్వరస్వామి

దేవాదాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఆలయానికి సంబంధించిన మాన్యం భూమికి నేటికి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం తెప్పించలేకపోయారు. చెరువు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలయానికి పరిహారం అందలేదు. సుమారు 7.40 ఎకరాల భూమి నేడు మార్కెట్ విలువ ప్రకారం రూ.కోటి వరకు ఉంటుందని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఈ పరిహారంతోనైనా ఆలయ పునఃనిర్మాణం చేపట్టవచ్చని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ఇలాంటి చరిత్ర ఉన్న ఆలయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై ఆలయ ఈవో కార్తీక్‌ను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

పట్టించుకోవడం లేదు



ఎంతో చరిత్రగల తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయానికి మాన్యం భూములు ఉన్నా దేవాదాయ శాఖ పట్టించుకోవడం లేదు. కనీసం చెరువులో మునకకు గురైన మాన్యానికి ప్రభుత్వం నుంచి పరిహారాన్ని తెప్పించి ఆలయాన్ని పునఃనిర్మించాలి.

- హనుమంతరెడ్డి, భక్తుడు, కొత్తపల్లి

అధికారుల నిర్లక్ష్యంతోనే...



దేవాదాయ శాఖ అధికారులు ఆలయం అభివృద్ధిపై దృష్టి సారించలేదు. సీజీఎఫ్ ద్వారానైనా ఆలయ అభివృద్ధి చేపట్టాలి. దేవాదాయ శాఖ నిర్లక్ష్యం వీడి ఎంతో మహిమ గల తాండవ మల్లేశ్వరాలయాన్ని అభివృద్ధి చేసి నాటి పూర్వ వైభవానికి తేవాలి.

- వినోద్‌కుమార్‌రెడ్డి, భక్తుడు, కొత్తపల్లి



ఆలయ ప్రాంగణం చుట్టూ చేరిన వర్షం నీరు

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పాములపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కాశి ముక్కంటి ఈశ్వరస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు: మండలంలోని రుద్రవరం గ్రామంలో ఆలయ, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి 15వేలు, రెండో బహుమతి 10వేలు, మూడో బహుమతి 5వేలు, నాలుగో బహుమతి 3వేలు, ఐదో బహుమతి 2వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ఈపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.300 చెల్లించి ఈనెల 9వ తేదీ సాయంత్రం లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని, వివరాలకు 9642882600, 8466853848 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర, వీరన్న కోరారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని గుండ్లకమ్మ వాగు, పీతురు వాగుతోపాటు ఆయా కాలనీల్లోని డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. దీంతో మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరగక పోవడంతో దోమల వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలుతున్నాయన్నారు. అయితే దోమలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆరో పించారు. మురుగు కాల్వల్లో హైపో ద్రావణం చల్లడంలోనూ, ఫాగింగ్ చేయడంలోనూ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిప డ్డారు. అదేవిధంగా కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అయ్యప్పస్వామి

ఆత్మకూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఏర్పాటై 26ఏళ్లను పూర్తిచేసుకుని 27వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా సోమవారం సప్తవింశతి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం నుంచే ఆలయంలో మహాగణపతి హోమం, కలశస్థాపన, అష్టోత్తరాలు, కలశాభిషేకాలు, సహస్ర నామార్చన, ఆవాహిత దేవతా హోమాలను నిర్వ హించనున్నారు. మధ్యాహ్నం మహామంగళహారతి, కుంభ ప్రోక్షణ తదితర కార్యక్రమాలను జరపనున్నారు. సాయంత్రం 6గంటల నుంచి స్వామివారికి విశేష అలంకరణతోపాటు భజనలు, ప్రాకా రోత్సవాలు నిర్వహించనున్నారు. రాత్రి 8గంటల సమయంలో పడిపూజ, పల్లకిసేవ, మహామంగళహారతి, వేదస్వస్తి, తీర్థ ప్రసాద కార్యక్రమాలను జపరనున్నారు.


రైతులు సలహాలు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మిడుతూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, ఆదినారాయణ అన్నారు. ఆదివారం వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమం మిడుతూరు మండలం లోని వీపనగండ్ల, చెరుకుచెర్ల, జలకనూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతూ భూసార ఆధారిత పద్ధతి ద్వారా పొలాలకు అవసరమైన ఎరువులను వినియోగించాల న్నారు. మొక్కజొన్న, మినుము, కంది, ఉల్లి, మిరప పంటలలో విత్తన శుద్ధి, తెగుళ్ల, పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మల్లికార్జున రెడ్డి, వ్యవసాయ సహా యకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మేఘాల మధ్య మహానందీశ్వరుడి ఆలయం



మహానంది, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంపై ఆదివారం సాయంత్రం ఆకాశంలోని మేఘాలు మేఘావృతమై నిలిచాయి. ఒక వైపు నల్లమల పచ్చదనం..మరోవైపు ఆకాశం తెల్లని మేఘా వృతమై నిలిచి నందీశ్వరుని ఆలయంపై గొడుగుగా నిలిచాయా అన్న రీతిలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆలయం ముందు భాగంలోని రాతి నందీశ్వరుడు చూస్తున్నట్లు ఉన్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరాతో క్లిక్ మనిపించింది.

మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆత్మకూరు అర్బన్ సీఐ రాముకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహిళలు



వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేస్తున్న మహిళా విభాగం నాయకులు

ఆత్మకూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళా విభాగం నాయకురాలు ఉమాదేవీ, సరోజ, వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌కు మహిళలతో కలిసి వెళ్లి అర్బన్ సీఐ రాముకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై నీచపు వ్యాఖ్యలు చేసిన ఓ మీడియా చానల్ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడిప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుంటే వైఎస్ జగన్ తన మీడియా సంస్థ ద్వారా జర్నలిస్టు ముసుగులు వేసుకున్న వ్యక్తులు మహిళలపై అసభ్యపదజాలంతో అగౌరవపర్చడం బాధాకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

నంద్యాల రూరల్: అమరావతి మహిళలను అవమానిస్తూ మాట్లాడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని నంద్యాల మండల అయ్యలూరు టీడీపీ నాయకురాలు బైరెడ్డి శంకరమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె నివాసంలో మాట్లాడుతూ మహిళలను కించపరిచేలా మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. దేవతలతో సమానంగా పూజించే మహిళలను క్షమించరాని పదజాలంతో అవమానకరంగా మా ట్లాడుతున్న జగన్ నోరెందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు మహిళలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు.

నంద్యాల టౌన్: అమరావతిపై నీచమైన వ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు విజయగౌరీ డిమాండు చేశారు. ఆదివారం స్థానిక గాంధీచౌక్‌లో టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైనాబీ, శ్రీదేవి, టీడీపీ మహిళా విభాగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో నంద్యాల మీదుగా రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సమీపంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల నుంచి నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి రైల్వే మంత్రితో చర్చించి రైళ్లను తిరిగి నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, అధ్యక్షుడు భూమిని శ్రీనివాసులు, మహిళా సంఘ పట్టణ కన్వీనర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల టౌన్, జూన్8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి, చెడు ప్రవర్తన కల్గిన వ్యక్తుల్లో మంచి నడతను తీసుకురావడానికి కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. రౌడీ షీటర్లు ఎటువంటి నేరాలు చేయరాదన్నారు. ఎవరైనా అలాంటి చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలు చేస్తుంటే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

యోగాతో ఆరోగ్యం: వెంకటసుబ్బయ్య



మయూర ఆసనం వేసిన వెంకటసుబ్బయ్య

నంద్యాల కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఇంజనీరు వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం నంద్యాల యోగా చైతన్యకేంద్రంలో ఏర్పాటుచేసిన యోగాంధ్ర కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య యోగాసనాలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. 70ఏళ్ల వయసులో కూడా తాను ఆరోగ్యంగా ఉండటానికి యోగానే కారణమన్నారు. యోగాతో మానసికగా, శారీకంగా ధృడంగా ఉంటారన్నారు.

నందీశ్వర స్వామికి విశేష పూజలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో ఆదివారం త్రయోదశి సందర్భంగా అర్చకులు వైభవంగా నందీశ్వరస్వామికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. నూతనవస్త్ర సమర్పణ, విశేషపూష్పార్చనలను చేశారు. నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి నైవేద్యంగా సమర్పించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆదివారం కళారాధన కార్యక్రమంలో భాగంగా తెనాలి నోరి నారాయణమూర్తి ఆధ్వర్యంలో దేవీమహాత్మ్యంపై ప్రవచనా కార్యక్రమం నిర్వహించారు. నిత్య కళారాధనలో భాగంగా హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యామ్నాయ వ్యవసాయం చేపట్టాలి

బండిఆత్మకూ జూన్8(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో అధిక లాభాలు పొందేందుకు ప్రత్యామ్నాయ పంటలు వేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవీంద్రగౌడ్ సూచించారు. ఆదివారం మండలంలోని ఈర్నపాడు, కడమలకాల్వ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు రబీ సీజన్ సాగుపై అవగాహన సమావేశాలు ఏవో స్వాతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, వీఏఏ సామ్రాట్ పాల్గొన్నారు.

గో సంరక్షణకు విరాళం

నంద్యాల కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ కోసం హైదరాబాదుకు చెందిన మహేష్‌రెడ్డి దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు హిమబిందు దాతకు రశీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందించారు. అనంతరం అర్చకులు దాత మహేష్‌రెడ్డి దంపతులను ఆశీర్వదించారు.

- శ్రీశైలంక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం బెంగళూరుకు చెందిన మల్లికార్జున దంపతులు రూ.1,00,116-లు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు హిమబిందు దాతకు రశీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందించారు. అర్చకులు దాత మల్లికార్జున దంపతులను ఆశీర్వదించారు.

అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు?

- అడ్డుకున్న అటవీ అధికారులు



ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నాటిన మామిడి చెట్లు

పాణ్యం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండజూటూరు సమీపంలోని అటవీ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం పాణ్యం అటవీ బీటులోని కొండజూటూరు సమీపంలోని అటవీభూములు చదునుచేసి సాగు చేసినట్లు తెలిసింది. దీంతోపాటు కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములతో పాటు పక్కనే ఉండే అటవీ భూములను చదును చేయడంతో సమాచారం తెలిసిన బీటు అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని అక్రమ తవ్వకాలు అడ్డుకొన్నట్లు తెలిసింది. కొంత కాలంగా కొంద రు అక్రమార్కులు ఎప్పటికే ప్రభుత్వ భూమిని ఆక్రమించి మామిడి చెట్లు నాటినట్లు తెలిసింది. ఈస్థలంలో అక్రమంగా రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. కొండ జూటూరు, గోరుకల్లు గ్రామాలకు చెందిన పశువులు కొండకు మేతకు వెళ్లడానికి అక్రమార్కులు అడ్డగించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా వేసిన రహ దారిపై వెళ్లడానికి పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా టీడీపీ నాయకుల పేరు చెప్పుకొని ఈతవ్వకాలకు పాల్పడి నట్లు సమాచారం. ఈ సంఘటనపై అటవీ రేంజ్ అధికారి విజయలక్ష్మిని వివరణ కోరగా తవ్వకాలు జరిపినట్లు తన దృష్టికి వచ్చిందని దీంతో పాణ్యం బీటు అధికారి జమాల్‌వలిని వెంటనే సంఘటనా స్థలానికి పంపించినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో మహేష్ అనే వ్యక్తి యంత్రాలతో చదునుచేసినట్లు గుర్తించామన్నారు. అతని ఇంటి వద్దకు వెళ్లి సోమవారం తన పొలం రికార్డులతో అటవీ కార్యాలయానికి రావాలని చెప్పామని అరు. మహేష్ పంట పొలంలోకి పాములు వస్తుండడంతో ఆ ప్రాంతాన్ని చదునుచేసినట్లు మహేష్ పేర్కొన్నట్లు తెలిపారు. ఆదివారం భారీ వర్షం కారణంగా అక్కడికి తాను వెళ్లలేకపోయానన్నారు. సోమవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

దంచికొట్టిన వర్షం

- ఈదురుగాలులకు నేలకూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- రాకపోకలకు అంతరాయం
- అబ్బీపురంలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు



నంద్యాల-మహానంది రహదారిలో విరిగిపడ్డ భారీ వృక్షం

మహానంది, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు తోడు వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని అల్లీనగరం వద్ద మూడు 11 కేవీ కరెంటు స్తంభాలు, వృక్షాలు నేలకూలాయి. దీంతో నంద్యాల నుంచి మహానందికి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మండలంలోని అబ్బీపురంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో ప్రజలు అష్ట కష్టాలు పడ్డారు. అతికష్టం మీద ఇళ్లలోకి చేరిన వరద నీటిని మహిళలు బయటకు పంపారు. అరటిపంటకు కూడా స్వల్ప నష్టం జరిగింది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

గాలివాన బీభత్సం

గోస్పాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో మండలంలోని పసురపాడు, గోస్పాడు, జూలేపల్లె, తేళ్లపురి తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, చెట్లు విరిగిరోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రేకుల షెడ్లు గాలికి ఎగిరి దూరంగా పడ్డాయి. ఆదివారం సాయంత్రం గాలివాన రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లపైకప్పు లేచిపోవడంతో ధాన్యం, వస్తువులు తడిసిపోయాయి. దాంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. మండలంలోని చాలాగ్రామాలు కరెంటు లేక పోవడంతో అంధకారం నెలకొంది.



గాలివానకు లేచిపోయిన ఇంటి పైకప్పు



రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్లు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

‘కౌలు’ కష్టం

- భారంగా మారిన వ్యవసాయం
- కౌలు రైతులకు అందని రుణం
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వైనం

బనగానపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కష్టాలు తీరేటట్లు లేవు. ప్రభుత్వాలు వీరిపట్ల చిన్నచూపు చూస్తున్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక, పొలాలకు కౌలు చెల్లించలేక, కుటుంబ భారాన్ని మోయలేక కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కాడి రథాన్ని భుజాన వేసుకొని మోస్తున్న కౌలు రైతులకు రుణాలు అందడం లేదు. రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండిస్తున్నా ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించడం లేదు. ప్రభుత్వం, బ్యాంకుల సహకారం లేక నిత్యం కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రుణాలు, మద్దతు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. కౌలు రేట్లు పెరిగి వ్యవసాయం చేయలేని పరి స్థితులు ఏర్పడ్డాయి. గత రెండేళ్లలో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోయారు. కౌలు రైతు ల కు ప్రభుత్వం నష్టపరిహారం అందించడం లేదు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ధరలు రెట్టిం పయ్యాయి. ఈ ఏడాది ధాన్యం ధరలు పూర్తిగా తగ్గడంతో కౌలు రైతులను పూర్తిగా కుంగదీసింది.

బ్యాంకర్ల చిన్నచూపు..

కౌలు రైతుల పట్ల బ్యాంకర్లు చిన్నచూపు చేస్తున్నారు. గతంలో బ్యాంకర్ల అవగాహన సదస్సులు నిర్వహించి కౌలు రుణఅర్హత కార్డులు మంజూరు చేసినా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాలు బ్యాంకర్లను ఆదేశించాయి. కాని బ్యాంకర్లు కొంతమంది కౌలుదారులకు మాత్రమే రుణాలు అందించింది. బనగానపల్లె మండలంలో గత సంవత్సరం 1900కుపైగా కౌలుదారులు ఉన్నారు. గత ఏడాది 1700 మంది కౌలు రైతులకు కౌలు రుణపత్రాలను మంజూరు చేయగా కేవలం 30 మంది కౌలుదారులకు మాత్రమే రుణాలు ఇచ్చారు. మిగతా కౌలు రైతులు బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణాలు ఇవ్వలేదు. కారణం కౌలు రైతులనుంచి 2 లేదా 5 ఎకరాలు మాత్రమే కౌలు రుణాలు తీసుకుంటారు. అయితే అసలైన రైతుకు చెందిన పట్టాదారు పుస్తకంలో అన్ని సర్వే నంబర్లు ఉంటాయి. దీంతో అసలైన రైతుకు రుణాలు తీసుకుంటారు. కాని కౌలు రైతులకు బ్యాంకులు కూడా రుణాలివ్వడానికి మొగ్గు చూపడం లేదు. పట్టాదారు పుస్తకాలు వారికే రుణాలు అందించడానికి బ్యాంకు అధికారులు మొగ్గు చూపుతున్నారు. కోవెలకుంట్ల డివిజన్‌లోని కోవెలకుంట్ల, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో సుమారు 2వేలకుపైగా కౌలు రైతులున్నారు. అయితే కేవలం 562 మంది కౌలు రైతులకు రూ. 83లక్షల రుణాలు బ్యాంకులు అందించారు. సగం మందికి పైగా రుణాలు అందలేదు. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో 1000 మంది కౌలురైతులు సదస్సుల్లో తమ పేర్లను కొత్తగా నమోదు చేసుకున్నారు. కాని వారికి రుణాలు బ్యాంకులు ఇవ్వడం లేదు వ్యవసాయం గిట్టకపోవడంతో అనేక మంది కౌలు రైతులు కూలీలుగా పనులు చేసుకుం టున్నారు. ఈ ఏడాది కూడా కౌలు రైతులు రుణ అర్హత కార్డులు మంజూరు చేయడానికి ఇంకా సమయం ఉండడంతో రెన్యువల్ చేయించుకోవడానికి బనగానపల్లె వ్యవసాయ కార్యలయానికి వచ్చి కౌలు రైతులు రుణ అర్హతకార్డులను రెన్యువల్ చేయించుకుంటున్నారు.


సేద్యం చేస్తున్న కౌలు రైతు

క్రీడలతో మానసికోల్లాసం

- బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లికార్జునరెడ్డి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల , జూన్ 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌కె విద్యాసంస్థల అధినేత లాయర్ ఆలీహుసేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలకు మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్రీడల్లో 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మునాని చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, న్యాయవాది హుసేనయ్య, సర్దార్, చంద్ర ప్రసాద్, ఉపేంద్ర, జశ్వంత్, మహ్మద్‌గౌస్, ఫయాజ్ పాల్గొన్నారు.

మహిళలను కించపరిచిన వారిపై చర్యలు చేపట్టాలి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

డోన్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఓ టీవీ చానెల్ డిబేట్‌లో అమరావతి వేశ్యల రాజధాని అని వ్యాఖ్యానించడం దుర్మార్గమైన చర్య అని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మావతి, తెలుగు మహిళా మండలి అధ్యక్షురాలు దానమ్మ అన్నారు. మహిళలను కించపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ నాయకులు ఎల్‌ఐసీ శ్రీరాములు, మిద్దెపల్లి గోవిందు, ఎద్దుపెంట మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు వలసల బాలుడు, రంగనాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ హక్కుల సాధించడం కోసం పెన్షనర్లు ఐక్యంగా పోరాడాలన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగి లక్ష్మయ్యను పెన్షనర్ల సంఘం నాయకులు శాలువతో సన్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు సుబ్బరాయుడు, గాలయ్య, గోపాల్, లోకనాథ రెడ్డి, మౌలాలి, నరసింహులు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన నాగేశ్వరరావు యాదవ్


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు యాదవ్

బనగానపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ ఆదివారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈనెల 15న ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని మంత్రిని ఆహ్వానించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ డీసీఎంఎస్ బాధ్యతలను స మర్థవంతంగా నిర్వహించి రైతులకు సేవలందించాలన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి దాతలు ఆదివారం రూ.2.05 లక్షల విరాళం అందించారు. ఆదోనికి చెందిన పూడూరు సుజాత, సుందర్‌రాజు కుటుంబ సభ్యులు ఆలయాభివృద్ధికి ఈమొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో పీవీ. నాగార్జునరెడ్డి, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా పడిన వృక్షం

రుద్రవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం గాలి వీయడంతో రహదారికి అడ్డుగా తుమ్మచెట్లు పడింది. అటుగా వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. దొర్నిపాడు మండలం డబ్ల్యూగోవిందిన్నెలో జరిగే పెద్దమ్మ జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బంది పడ్డారు. వృక్షాన్ని తొలగించే ప్రయత్నం చేసి విఫలం కావడంతో వాహనాలు నిలిచిపోయాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శిరివెళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, చిత్తూరు 40వ జాతీయ రహదారిపై యర్రగుంట్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే యర్రగుంట్ల వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్నపీరయ్య ఘటనా స్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతిచెందిన వృద్ధుడి వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటాయన్నారు. వృద్ధుడి మృతదేహాన్ని పంచనామ నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

డోన్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, బాలింతలు, గర్భిణులు వారి బంధువులకు ప్రార్థన సమయం ఆధ్వర్యంలో ఆదివారం పాస్టర్ జానీ ప్రభాకర్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తన వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

గంగమ్మకు విశేష పూజలు

చాగలమర్రి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని చె రువుకట్ట మీద వెలసిన గంగమ్మకు ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా అమ్మవారికి వడిబియ్యం కార్యక్ర మాన్ని నిర్వహించారు. పెద్దమ్మ, చాగలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ దేవర

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేక పూజలు

దొర్నిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో మూలపెద్దమ్మ దేవరను ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. 11ఏళ్ల తరువాత పెద్దమ్మ దేవర వైభవంగా జరగడంతో గ్రామంలో ప్రతి ఇళ్లు బంధువులతో కళకళలాడింది. దేవర సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని అర్చకులు అన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఏరువ ప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ అభిలాష్‌రెడ్డి, గంగవరం కృష్ణారెడ్డి, బాబు, అంజి ఉన్నారు.

నేడు గండాదీపోత్సవం

మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ దేవర సందర్భంగా సోమవారం గండాదీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గండాదీపంలో పాల్గొని గండాదీపం మోస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అఖిలప్రియ

అభయాంజనేయస్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలో ఆదివారం అభయాంజనేయస్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొనగా, టీడీపీ నాయకులు చవ్వ శివారెడ్డి, పగిడెల పవన్‌రెడ్డి, నాగలింగేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. స్వామివారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. సీతారామస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

బేతంచెర్లలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

- సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ


బేతంచర్లలో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న రంగనాయుడు

బేతంచెర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని సీపీఐ జిల్లా ప్రధానకార్యదర్శి రంగ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్టాండులో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ అధ్యక్షతన ప్రజల సంతకాల సేకరణను ప్రారంభించారు. సీపీఐ జిల్లా ప్రధానకార్యదర్శి రంగనాయుడు సంతకం చేసి మాట్లాడారు. కరోనా కారణంగా రద్దయిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం, టీడీపీ, వైసీపీ, సీపీఎం, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు మండల ఖాజీ నూర్‌అహ్మద్, సీనియర్ జర్నలిస్టు వెంకట్రాముడు మద్దతు ప్రకటించి సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, సభ్యులు దస్తగిరి, ఏసన్న, ఏఐఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ నాయకులు పాల్గొన్నారు.

రద్దయిన రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి

డోన్ టౌన్: కరోనా సమయంలో రద్దయిన ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలంటూ సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డోన్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుంకయ్య, సాదిక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు దీక్షకు టీడీపీ సంఘీభావం


కార్మికులను సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

బేతంచెర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ఫ్యాక్టరీ గేటు ముందు దీక్షలో కూర్చున్న కార్మికులకు టీడీపీ నాయకులు తమ సంఘీభావాన్ని తెలిపారు. దీక్ష ఆదివారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, మాట్లాడుతూ కార్మికులకు సిమెంటు ఫ్యాక్టరీ జీవనాధారం అని, వారికి ఎలాంటి జీవనోపాధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం మొండి వైఖరి వీడి ఫ్యాక్టరీని నిర్వహిస్తే కార్మికులకు ఉపాధి ఉంటుందన్నారు. 13 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం సుధాకర్, రాముడు, ఉరుకుందు, వాసు, వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ



సమావేశంలో టీడీపీ నాయకులు ఉగ్రసేనారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి

అవుకు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గతంలో వైసీపీ నవరత్నాల పథకాల హామీలతో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు కాట్రెడ్డి మల్లికారుజనరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, అరుణ్‌కుమార్‌నాయక్, తిక్కన్నతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రసేనారెడ్డి మాట్లాడుతూప్రజలను వెన్నుపోటు పోడవటంతోనే వైసీపీ 11 సీట్లకు పరిమితమైందన్నారు. వైసీపీకి వెన్నుపోటు దినం నిర్వహించే హక్కే లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయ జగన్, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరాలు

సంజామల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ముగిశాయి. మే 2 నుంచి ఈ శిబిరాలను నిక్షిప్త కేంద్ర నిర్వాహకులు మద్దిలేటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామంలోని విద్యార్థులకు ప్రతిరోజు తెలుగు, ఇంగ్లీషు కాపీ రైటింగ్, కథలు చదవడం, దినపత్రికలు చదివించడం, చెస్, లూడో, వైకుంఠపాలి ఆటలను విద్యార్థులతో ఆడించారు. ముగింపురోజు ముఖ్యఅతిథిగా గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి హాజరై విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, స్వీ ట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె. సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సంజామల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నొస్సం గ్రామంలో వెలిసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్వామివారికి అక్షతారోహణం కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. ఈ నెల 15 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాల మద్దిలేటి, ఈవో చంద్రుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంగోలు జాతి ఎద్దుల రాష్ట్రస్థాయి పోటీలను ఏర్పాటుచేశామన్నారు. ఈ పోటీలను ప్రారంభించేందుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరుకానున్నట్లు టీడీపీ నాయకులు రమణయ్య, వెంకటేశ్వర్లు తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


పెద్దకంబలూరులో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

రుద్రవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో ఆదివారం బండలాగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో విజేతల వృషభాలు ఇలా అక్షరరెడ్డి నాగర్‌కర్నూలు ప్రథమ బహుమతి రూ.40వేలు, నంద్యాలకు చెందిన చంద్రశేఖరరెడ్డి వృషాభాలు రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ. 20వేలు శశాంక శ్రియ కోడుమూరు, నాలుగో బహుమతి కర్నూలుకు చెందిన వరలక్ష్మి రూ.10వేలు, అప్పనపల్లె చెందిన షేక్ పఠాన్‌షరీఫ్ ఐదో బహుమతి రూ.5వేలు అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు వృషభ యజమానులకు షీల్డ్ అందించారు.

పురాతన ఆలయానికి నూతన శోభ


రంగులతో కళకళలాడుతున్న ఆలయం

కొలిమిగుండ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పె ట్నీకోట గ్రామంలో వెలసిన అతి పురాతన ఆలయం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకోనుంది. దాతల సహకారంతో ఆలయానికి నూతన రంగులు వేస్తుండటం భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయ ప్రధాన అర్చకులు గిరిస్వామి అధ్యక్షతన ఆలయానికి కొత్త మెరుగులు దిద్దుతున్నారు. దీంతో ఆలయం నూ తన రంగులతో కళకళ లాడుతోంది. దాతలు మరింతగా ముందుకు వస్తే శ్రీకృష్ణుడి ఆలయానికి రంగులు వేయాడానికి ప్రయత్నిస్తున్న ట్లు అర్చకులు గిరిస్వామి తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌పై నిర్లక్ష్యం వహించకూడదు

కొలిమిగుండ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)పై అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమ వారం నిర్వహించే పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేరాలకు పాల్పడితే భవిష్యత్తు అంధకారం

కొలిమిగుండ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆవేశంతో, స్వార్థపూరిత ఆలోచనలతో నేరాలకు పాల్పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో మండలంలోని పాత నేరస్థులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. క్షణికావేశంలో తెలిసో తెలియకో తప్పులు చేసిన వారు తమ ప్రవర్తనను మార్చుకొని శాంతియుత జీవనాన్ని కొన సాగించాలని సీఐ సూచించారు. నేరాలకు పాల్పడటం వలన కుటుంబ సభ్యులు కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఐ వివరించారు.

నరసింహస్వామి ఆలయాల్లో స్వాతి పూజలు


పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

రుద్రవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం, రుద్రవరం సమీపంలోని దొర్వి, గుట్టకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో ఆదివారం స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, యల్లావత్తుల, కొండమాయపల్లె, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు, చీరలు సమర్పించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలుచేశారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

చాగలమర్రి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీ విషయంలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్టీయూ అదనపు కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను విద్యాశాఖ ఉన్నతాధికారులు మోసగిస్తూ వెబ్ కౌన్సెలింగ్‌కు సన్నద్ధమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి మ్యాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ సంఘ నాయకులు మస్తాన్‌బాషా, మాబు హుసేన్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారావు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కుమ్మరి చంద్రశేఖర్ (34) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నివాసముంటున్న కుమ్మరి చంద్రశేఖర్ అప్పుల బాధ భరించలేక ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డుపైనే మురుగు


లింగం దిన్నెలో రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు

ఆళ్లగడ్డ జూన్ 8(ఆంధ్రజ్యోతి): రోడ్లపైనే మురుగు నీరు పారుతుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండలం ఎస్ లింగం దిన్నె గ్రామంలో రోడ్లపైనే మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై రోజుల తరబడి నిలిచిపోతోంది. కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జోరుగా సారా విక్రయాలు


మోటార్‌సైకిల్‌పై తరలిస్తున్న సారా సంచులు(ఫైల్)

కొలిమి గుండ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే చిన్న కుగ్రామమైన మీర్జాపురం సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో 1200మంది జనాభా ఉండగా, తాగడానికి సరైన నీరు లభించడం లేదుకానీ, సారా మాత్రం విచ్చలవిడిగా దొరుకుతోంది. సంబంధిత అధికారులు అడపాదడపా దాడులు చేసి సరిపుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుగ్రామంలోనే నాలుగు సారా దుకాణాలు ఉన్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నాలుగు నెలల క్రితం సారాకు బానిసగా మారి ఓ వ్యక్తి మృతి చెందగా, తాజాగా మరోవ్యక్తి మృతి చెందాడు. చాలామంది తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సారా విక్రయాలను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదం అంచున కేసీ వంతెన


దెబ్బతిన్న కేసీ కాలువ వంతెన

చాగలమర్రి, జూన్ 8 (ఆంధ్ర జ్యోతి): చాగలమర్రి గ్రామంలోని 40వ జాతీయ రహదారి సమీపంలో కేసీ కాలువపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారింది. రహదారిపై వచ్చే వాహనాలు వంతెనను ఢీకొనడంతో సిమెంట్ గోడలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. హైవే కావడంతో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రాత్రి వేళలో ఆదమరిస్తే వాహనాలు కేసీ కాలువలో బోల్తాపడే ప్రమాదం ఉన్నది. హైవే, కేసీ అధికారులు స్పందించి కేసీ కాలువకు నీరు ప్రవహించకముందే వంతెన మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

పరిమితికి మించి ప్రయాణం

చాగలమర్రి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ముప్పు పొంచి ఉంది. అధిక సంఖ్యలో ఆటోలో కూర్చొని వెళ్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదమరిస్తే ప్రమాదం వాటిల్లుతుంది. ప్రమాదమని తెలిసిన కూలీలు లెక్క చేయకుండా ఆటోలో వెళ్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో కూలీలను, ప్రయాణికులను ఎక్కించుకోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.


చాగలమర్రిలో ఆటో వెనుక వైపు కూర్చొని వెళ్తున్న మహిళా కూలీలు